క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

శంకరపట్నం: గామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. ఎరడపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మొబైల్ యాప్‌ను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సకాలంలో ఇంటిపన్నులు వసూలు చేయాలని, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ నెలసరి వాయిదాలు సక్రమంగా చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ బషీరొద్దీన్, కార్యదర్శులు, కారోబార్లు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న నిషాని రాంచంద్రం

మానకొండూర్‌రూరల్: ఇటీవల వెలువడిన ఎస్సై ఫలితాల్లో మండలంలోని పచ్చునూర్‌కు చెందిన మొగిలి అన్వేశ్‌యాదవ్ సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. బీఎస్పీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి నిషాని రాంచంద్రం మంగళవారం యువకుడిని సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ... యువత ఉన్నత చదువులు చదివి జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సతీష్, అంజయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ ఆరోగ్యం

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ నెల 13న నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 14 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను ఎస్ఐ ఆరోగ్యం మంగళవారం అభినందించారు. క్రీడల్లో రాణించాలని ఆసక్తి ఉన్న విద్యార్థులకు తన వంతు చేయూతనందిస్తానని హామీ ఇచ్చారు.

గోపాల్‌రావుపేటలో..

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి శ్రీహర్ష సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 16న జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్జీఎఫ్ వాలీబాల్ పో టీల్లో కరీంనగర్ జిల్లా జట్టు తరుపున ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. శ్రీహర్షను మంగళవారం అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.



పల్లెప్రగతి పనులు పరిశీలన



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గంగాధర: శిక్షణలో భాగంగా మండలంలోని గట్టుభూత్కూర్‌లో గ్రూప్ ఏ అధికారులు మంగళవారం పల్లె ప్రగతి పనులు పరిశీలించారు. శ్మశానవాటిక, కంపోస్ట్‌షెడ్డు, వనసర్సరీలతో పాటు రేషన్ షాపులు, పవర్‌లూమ్స్, అంగన్‌వాడీకేంద్రాలను సందర్శించారు. వెంట సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు



జమ్మికుంట: పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దబ్బెట విజయరవీందర్, ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, చిరంజీవి, శివ, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

14 మంది బైండోవర్

జమ్మికుంట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 14 మందిని తహసీల్దార్ రజని ఎదుట బైండోవర్ చేశామని టౌన్ సీఐ బార్పాటి రమేశ్ మంగళవారం తెలిపారు. మండలంలోని బిజిగిరిషరీఫ్, నాగారం, విలాసాగర్ గ్రామాలకు చెందిన బెల్ట్‌షాపు నిర్వాహకులను బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

చొప్పదండి: పట్టణంలోని రామాలయం వీధిలో మాతా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. కాలనీలోని మహిళలు బోనాలతో ర్యాలీగా, డప్పు చప్పుళ్లు, నృత్యాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించారు. నవరాత్రులను పురస్కరించుకొని ప్రతిరోజూ ప్రత్యేక పూజలు ఉంటాయని మండపాల నిర్వాహకులు తెలిపారు.

జమ్మికుంట: పట్టణంలోని శ్రీచెన్నకేశవ దేవాలయం, మండపాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాతకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు మూడో రోజు అన్నపూర్ణ, శాకాంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

చిగురుమామిడి: మండలంలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం పార్వతి చంద్రశేఖరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీపీ మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాత మ్యాన మహేందర్, కవిత దంపతులను అభినందించారు. పూజారి ఆకవరం శివప్రసాద్, లక్ష్మి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గాదె రఘునాథరెడ్డి, ఉపసర్పంచ్ ముక్కెర పద్మసదానందం, మాజీ ఎంపీపీ ఆకవరం భవాని, చిటుమల్ల రవీందర్, ఉల్లెంగుల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: బోనాలతో తరలివస్తున్న మహిళలు





జమ్మికుంట: అమ్మవారిని దర్శించుకున్న మహిళలు, చిగురుమామిడిలో అన్నదానం

రైస్‌మిల్ తనిఖీ

శంకరపట్నం: కేశవపట్నం శివారులో ఉన్న ఓ రైస్‌మిల్‌లో మంగళవారం పౌరసరఫరాలశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కస్టమ్స్ మిల్లింగ్ రైస్ నిల్వ లేదని గుర్తించారు. ధాన్యం నిల్వలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నామని డీటీసీఎస్ వేణుగోపాల్ తెలిపారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

హుజూరాబాద్‌రూరల్: వరిసాగులో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలని కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని సిర్సపల్లి గ్రామంలోని పలు వరి పంట క్షేత్రాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా మండలి మాజీ సభ్యుడు వంగల వెంకటరెడ్డి కలిసి సందర్శించారు. సన్నగింజ రకాల్లో ఆకునల్లి కంకినల్లి, దోమపోటు వంటివి గుర్తించారు. నివారణకు సూచించిన మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. పూత దశలో వుంటే మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు పిచికారీ చేయాలన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్





మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, మానకొండూర్‌లో మాట్లాడుతున్న లక్ష్మీకిరణ్

చొప్పదండి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా, ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పరిసరాలను మంగళవారం పరిశీలించారు. ఆర్నకొండలోని రాష్ట్ర రహదారిపై చెక్‌పోస్టును ఏసీపీ కరుణాకర్‌రావుతో కలిసి తనిఖీ చేశారు. మండలంలోని రుక్మాపూర్ సైనిక శిక్షణ పాఠశాలలో పారా మిలటరీ బలగాలు ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ నరేందర్, సీఐ రవీందర్, ఎస్ఐ ఉపేంద్రచారి, ఎంపీడీవో స్వరూప పాల్గొన్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావొద్దు

ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలని, సందేహాలుంటే టోల్‌ఫ్రీ నంబర్ 1950 కాల్ చేయాలని మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం దుర్గాభవానీ పట్టణ సమాఖ్య సభ్యులకు ఓటుహక్కుపై అవగాహన కలిగించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటరు లిస్టులో పేరు నమోదు అయిందో లేదో సరిచూసుకోవాలని సూచించారు. లేదంటే ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ డి. ప్రశాంత్ కుమార్, మెప్మా ఏడీఎంసీ కె. మానస, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని అధికారులు, పలు పార్టీల రాజకీయ నాయకులతో అసెంబ్లీ ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ప్రచారానికి వాహనాలు ఉపయోగిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, డీటీలు, తదితరులు పాల్గొన్నారు.

‘గౌరవెల్లి’ విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ

తిమ్మాపూర్: గౌరవెల్లి ప్రాజెక్టు అనుబంధంగా ఇందిరమ్మ వరదకాలువ విస్తరణపై మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. మండలంలోని ఎల్ఎండీకాలనీ శ్రీవేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి ప్రభావిత గ్రామాల ప్రజలు, రైతులు హాజరయ్యారు. ఈసందర్భంగా డీఆర్‌వో పవన్‌కుమార్ మాట్లాడారు. పర్యావరణానికి హాని కలగకుండా ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా మండలాలకు చెందిన పలువురు రైతులతో పాటు ప్రజల అభిప్రాయాలను సేకరించారు.

అవకతవకలపై అభ్యంతరం..

గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌లో అనేక అవకతవకలు ఉన్నాయని రైతులు అభ్యంతరం తెలిపారు. భూ సేకరణలో అందరికీ సమాన పరిహారం అందలేదని తెలిపారు. కాలువల నిర్మాణం సక్రమంగా లేదని డీఆర్వో దృష్టికి తీసుకొచ్చారు. మొదటగా 1.41టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు డీపీఆర్ రూపొందించి, 8 టీఎంసీలకు పెంచారని, ఇందుకోసం ఎలాంటి పర్యావరణ అనుమతులు లేవని, ప్రాజెక్టు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఉప్పు లింగయ్య ఆరోపించారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజేందర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం, పి. రమేష్, సదయ్య, డి. మధుసూదన్, రేష్మ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో సీపీఐకి 20వేల ఓటుబ్యాంకు



మాట్లాడుతున్న బోయిని తిరుపతి

మానకొండూర్: కాంగ్రెస్ పార్టీతో పొత్తు కుదరకుంటే మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీపీఐ నాయకుడు బరిలో ఉంటాడని పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బోయిని తిరుపతి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. పార్టీకి మానకొండూర్ నియోజకవర్గంలో అభిమానులు, కార్యకర్తలు ఎక్కువగా ఉన్నారని, పోటీ చేస్తే గెలిచే అవకాశం మెండుగా ఉందన్నారు. సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘాలు సీపీఐ పరిధిలో ఉన్నాయని, కార్మిక సంఘం పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతుందని, రైతు కూలీలు, కార్మికులు, విద్యార్థులు, యువకులు కమ్యూనిస్టులను కోరుకుంటున్నారని, సీపీఐకి ఓటుబ్యాంకు 20 వేల వరకూ ఉందన్నారు. ఎస్సీ నియోజకవర్గాన్ని వదులుకునే ప్రసక్తే లేదని, కచ్చితంగా పోటీలో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బండ రాజిరెడ్డి, కేశవపట్నం మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, సహాయ కార్యదర్శి కన్నం సదానందం పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలి

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీకౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట: బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుడిలా పనిచేస్తూ పార్టీని గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నికోమటిపల్లి, టేకుర్తి, గడ్డివానిపల్లి, మల్లివాని పల్లి ,సీతంపేట గ్రామాల్లో మంగళవారం ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరోసారి బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టాలని కోరారు. ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశమిస్తే హుజూరాబాద్‌ను అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయగణపతి, నాయకులు సరిగొమ్ముల వెంకటేశ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మోటపోతుల ఐలయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కలాల రాజిరెడ్డి, చిట్ల నాగయ్య, కొమురయ్య, తేడ్ల ఓదెలు, మూడెత్తుల వెంకటస్వామి, ఎక్కటి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మామిడాలపల్లి హెచ్‌ఎంకు అబ్దుల్‌కలాం ఎక్సలెన్స్ అవార్డు



శోభారాణిని సత్కరిస్తున్న జడ్జి సత్యేంద్ర

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శోభారాణిని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. హన్మకొండలోని ఆరోమా హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్జి సత్యేంద్ర, సీనియర్ సూపిరింటెండెంట్ అంజనీకుమారి చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు అవార్డును స్వీకరించారు. విద్యారంగంలో నోడల్ అధికారిగా, పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయడంతో పాటు వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టినందుకు శోభారాణికి అవార్డు అందజేశామని ఫౌండర్ రవికుమార్ తెలిపారు. అవార్డు రావడం పట్ల ఎంఈవో శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమార్, పీఆర్‌టీయూ, ఎస్టీయూ జిల్లా బాధ్యులు కరుణాకర్ రెడ్డి, బాలాజీ, మాధవస్వామి హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో బొడిగె శోభకు ఘన స్వాగతం



ప్రచారం చేస్తున్నన్న బొడిగె శోభ

గంగాధర: మండలంలోని ర్యాలపల్లి, కోట్లనర్సింహులపల్లి, ముప్పిడినర్సింహులపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకురాలు బొడిగె శోభ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ర్యాలపల్లిలోని దుర్గామాత మండపంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నర్సింహులపల్లి, ముప్పిడిపల్లి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యేగా గ్రామాల్లో చేసిన అభివృద్ధిని వివరించడంతో పాటు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో బొడిగె శోభకు మహిళలు ఘనస్వాగతం పలికగా వారితో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి అవకాశం ఇవ్వండి



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న రవిశంకర్

రామడుగు: గ్రామాల్లో చేసిన అభివృద్ధిపనులను గుర్తించి మరోసారి చొప్పదండి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరుతూ.. మండలంలోని పందికుంటపల్లి, కుర్మపల్లి, చిప్పకుర్తి, రాంచంద్రాపూర్, గుండి, లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటింటా ప్రచారం చేశారు. స్థానికుడిగా, చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఉందని, అన్నివర్గాల ప్రజల జీవితాలలో వెలుగులు నింపుతుందన్నారు. వెంట ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరు

హుజూరాబాద్: బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని, హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలను పక్కాగా అమలు చేస్తుందని, నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే



కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

మానకొండూర్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ కార్డులను మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం కార్యకర్తలు ఇంటింటికీ పంపిణీ చేశారు. గత కాంగ్రెస్ పాలనలోని అభివృద్ధి, అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణకు ఓటువేసి గెలిపించాలని కోరారు. గ్రామశాఖ అధ్యక్షుడు మహేందర్, చంద్రమౌళి, సంతోష్, సురేందర్, మల్లయ్య, శ్రీనివాస్, కుమార్, చక్రపాణి, ప్రభాకర్, కర్రె శ్రీనివాస్‌రెడ్డి, తంగళ్లపల్లి సంపత్ ఉన్నారు.

శంకరపట్నం: కాంగ్రెస్ గ్యా రెంటీ పథకాలపై కార్యకర్తలు గ్రామాల్లో ప్రచారం చేశారు. మండలంలోని కాచాపూర్, ముత్తారం, తాడికల్‌లో ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ గట్టు తిరుపతిగౌడ్, నాయకులు తిరుపతి, ప్రభాకర్, రాజయ్య, ఓదెలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న కొర్ని ధర్మారెడ్డి

వీణవంక: వైఎస్సార్‌టీపీ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కొర్ని ధర్మారెడ్డి మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అధికార ప్రతినిధి పిట్ల రాంరెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ నీలం రమేశ్‌కు దరఖాస్తు ఫారం అందించారు. ఈసందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ... పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్నానని, అధినేత్రి వైఎస్ షర్మిల సూచన మేరకు దరఖాస్తు చేశానని వివరించారు. హుజూరాబాద్‌లో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇస్తానని, గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు.

అర్థశాస్త్ర అధ్యాపకుడు రామ్మోహన్‌రావుకు డాక్టరేట్



జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు రామ్మోహన్‌రావుకు ఉస్మానియ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపక బృందం మంగళవారం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. రామ్మోహన్‌రావు ఉస్మానియా విశ్వవిద్యాలయం అర్థశాస్త్రం ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎడమ శ్రీనివాస్‌రెడ్డి, పీడీ సూజాత, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సువర్ణ, స్వరుపారాణి, ఈశ్వరయ్య, డాక్టర్ ఎంబడి రవి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, సుధాకర్, లైబ్రేరియన్ భీమారావు, ప్రశాంత్, సాయితో సిబ్బంది పాల్గొన్నారు.


ప్రాథమిక హక్కుల కల్పనే ధ్యేయం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

మానకొండూర్: పేదలకు ప్రాథమిక హక్కులు కల్పించడమే ధర్మ సమాజ్ పార్టీ ధ్యేయమని డీఎస్పీ మానకొండూర్ నియోజవర్గ నాయకుడు దాసపురి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. కాన్షీరాం జన్మదినం సందర్భంగా విశారదన్‌మహారాజ్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భవించిందన్నారు. కొన్నేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, అగ్రవర్ణ పేదలకు పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు కల్పించడం కోసం పార్టీ పనిచేస్తుందని, ఇదే మేనిఫెస్టోగా రాబోతుందన్నారు. ఇప్పటివరకూ పాలించిన ఎమ్మెల్యేలు అగ్రవర్ణ పార్టీల చేతులో బానిసలుగా మారారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాకేశ్ దాసారపు సదానందం, చంద్రగిరీ రవీందర్, ఆరెల్లి బాబు, కనుకం లక్ష్మణ్, ఆరెల్లి సతీష్, దరిపెల్లి సురేశ్, దరిపెల్లి హరీశ్, దరిపెల్లి నరేశ్, బోడ అశోక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ‘బీసీబంధు’



మాట్లాడుతున్న ముక్కెర సతీశ్

మానకొండూర్: దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ బీసీబంధు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర సతీశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో కొండపల్కల గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గృహలక్ష్మి అర్హులకే కేటాయించాలని సూచించారు. బీసీబంధు బీఆర్ఎస్ కార్యకర్తలకే అందుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, శ్రీనివాస్, రాజు, వినోద్, అంజి, శ్రీరామ్, రవిపాల్గొన్నారు.

ఇసుక లారీల అడ్డగింత



మానకొండూర్: ఇసుక లారీలతో ఇబ్బందులు పడుతున్నామని మానకొండూర్ గ్రామస్తులు మంగళవారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. వీణవంక మండలం నుంచి వస్తున్న లారీలను నిలిపివేశారు. కంకర రోడ్డుపై వాహనాలు వెళ్తుండటంతో దుమ్ము లేస్తుందని, తారురోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవడం లేదని డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో లారీలను వదిలేశారు.

అన్నిగ్రామాల్లో హైమాస్ట్ లైట్లు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని జెడ్పీటీసీ గీకురు రవీందర్ తెలిపారు. మంగళవారం ఆయన చిగురుమామిడిలో మాట్లాడారు. జిల్లా పరిషత్ గ్రాంట్స్ నుంచి రూ. 25.80 లక్షలతో 24 హైమాస్ట్ లైట్లు సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ముఖ్యమైన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నామని, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సహకారంతో మరిన్ని నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.